సూర్యుడు ఒక్కో ఇంటిని పలకరిస్తూ కిరణాలతో తట్టి నిద్రలేపుతున్నాడు. మోన్ పా అప్పుడే నిద్ర లేచి బద్ధకంగా కాలకృత్యాలు తీర్చుకుంటున్నాడు. లేచి భార్య కోసం చూసాడు. ఆమె ఎంచక్కా టీవీ చూస్తూ టిఫిన్ తింటూ కనిపించింది. నిన్న రాత్రే ఆమె తనతో పెట్టుకున్న గొడవ తాలూకు అలకతో కూర్చుంది. అందుకే అతనికి పొద్దున్నే ఇచ్చే కాఫీ గీఫీ ఏదీ ఇవ్వలేదు.

నిజానికి ఇద్దరిదీ ప్రేమ వివాహం.మోన్ పా సముద్రంలో ఈత కొట్టగలిగిన గజ ఈతగాడు. వృత్తి రీత్యా ఫ్రీలాన్స్ గా డైవర్ గా పని చేస్తుంటాడు. నిజానికి ఆ ఉద్యోగం ఏమంత ప్రయోజాదాయకంగా ఉండదు. బాగా ఫేమస్ అయితేనో , కాంట్రాక్టులు ఏమన్నా కుదిరితేనో తప్ప ఇల్లు గడవటానికి గానీ ఆ రంగంలో అవకాశం తక్కువ. అందులో భాగంగా తమ ప్రాంతానికి వచ్చే టూరిస్టులతో సముద్రంలోకి వెళ్లడం , మెరైన్ డిపార్ట్మెంట్ వారు ఏదైనా పని అప్పచెప్పడం లాంటి పనులు వస్తే తప్ప వారికి పొట్ట పోసుకోవడానికి ఈ ఉద్యోగం ఏమాత్రం కొరగాదు. ఈ విషయం పైనే నిన్న రాత్రి ఇంట్లో గోల. ఈ పని మానేసి ఏదైనా షాప్ పెట్టుకుంటే జీవితం ఇంకా బాగుంటుంది కదా" అని భార్య అతనితో యుద్ధం. తన కిష్టమైన వృత్తిని ఎందుకు వదలాలని తాను బెట్టు వేసుకుని కూర్చున్నాడు.

లేవడం లేవడమే రోజు ఇలా చిరాకు గా మొదలవ్వడం తో గత రాత్రి తాలూకు అనుభవాలను మళ్ళీ గుర్తొచ్చి ఇర్రిటేట్ అవుతున్నాడు. రెడీ అయ్యి వచ్చి టిఫిన్ అడిగాడు మోన్ పా, తన భార్య **రాధా షాపో** ని. అతనికి రిప్లై ఇవ్వలేదు. కనీసం, మంచి నీళ్లు తాగమని అడగలేదు. వాళ్ళిద్దరికీ గొడవ అయినప్పుడల్లా పరిస్థితి ఇలానే ఉంటుంది. ఒక వారం రోజుల పాటు ఆమె మౌన వ్రతం. ఇతను ఘోర తపస్సు.

సరిగ్గా అప్పుడే మోగింది ఫోన్. అవతల డైవింగ్ వృత్తిలో తనతో పాటు పని చేసే స్నేహితుడు షముకా చా నుండి ఫోన్.

" మోన్ పా ! తొందరగా రెడీ అయ్యి వచ్చెయ్ మనిద్దరికీ పెద్ద పని ఏర్పడింది. "

" ఏం పనో ?"

" అదంతా కాసేపట్లో చెబుతా . ముందు బట్టలు అన్నీ రెడీ చేసుకుని వచ్చేసేయ్. పక్క రాష్ట్రంలో మనకు పెద్ద పని పడింది. మంచి బేరం "

ఫోన్ వచ్చిందే తడవు , ప్యాక్ చేసుకుని బయలుదేరడానికి సిద్ధం అయ్యాడు. అసలే వానా కాలం , అలాంటి పిలుపులు , కాంట్రాక్టులు అతనికి రావడం తక్కువ. లేక లేక ఏదో ఒక్క ఛాన్స్ వచ్చింది స్నేహితుడితో కలిసి డైవింగ్ పని మీద వెళ్ళడానికి. భార్యను పిలిచాడు

" ఓ.... షాపో ! నేను వెళ్తున్నా"

అవతలి వైపు నుండి బదులు లేదు.

"ఇదిగో పక్క రాష్ట్రం కి వెళ్తున్నా , షముఖా ఛా ఫోన్ చేసాడు. ఏదో పని అంట "

" ఆ సరే " అని విసురుగా ఒక మాట అనేసి టీవీ చూస్తోంది రాధా షాపో.

సరేలే అనుకుని ప్యాక్ చేసుకుని ఇంటి నుండి తలుపు దాటాడు.

అప్పుడే వెనుక నుండి రాధా షాపో పిలుపు వినపడింది.

" ఏమయ్యా. ఎప్పుడు మళ్ళీ రాక "

" మ్మ్. తెలియదు. రెండు రోజుల్లోపలే వస్తాలే" అన్నాడు.

రాధా షాపో కు ఏదో మనసులో తట్టింది.

" పక్క రాష్ట్రం అన్నావ్ గా. అంటే ఎక్కడ?" అని అడిగింది.

" ఏమో ఇంకా ఏమి చెప్పలేదు నాకు " అన్నాడు.

టీవీలో చూసింది. పక్క రాష్ట్రం గురించే ఇప్పుడు ప్రపంచం మొత్తం మాట్లాడుకుంటోంది. అక్కడ ఒక గుహలో 12 రోజులుగా పిల్లలు ఇరుక్కుపోయి ఉన్నారు. కొంప తీసి తన భర్త అక్కడికి వెళ్తున్నాడా అని డౌట్ వచ్చింది.

" ఒక సారి వెనక్కు రా " అని పిలిచింది.

" అక్కడ తం లువాంగ్ గుహల్లో పిల్లలు చిక్కుకున్నారు అంట. కొంపతీసి అక్కడేమైనా మునిగే పనా ? " అని అనింది.

" పెద్ద పెద్ద అంతర్జాతీయ టీంలు పని చేస్తున్నాయి అక్కడ. ఈ పేద డైవర్ ని ఎవరు పిలుస్తారు లే. అసలు అక్కడికెళ్తున్నామో లేదో తెలియదు. " అని అన్నాడు.

" సరే సరే. జాగ్రత్తగా వచ్చెయ్." అని అంది రాధ ఆందోళనగా.

రాధ షాపో ఎప్పుడూ అంతే. వారం రోజులు బాగా గొడవపడి , ఒక్క ప్రేమగా మాట్లాడుతుంది. అంతే దెబ్బకి ఆ బాధ మొత్తం మరిచిపోవాల్సిందే. అందుకే వాళ్లిద్దరూ అన్యోన్యంగా ఉన్నారు.

"వచ్చేస్తా లే. "

**" నిజంగా. నెత్తి మీదకు తెచ్చుకోవుగా" అని ముద్దుగా అడిగింది.**

**" లేదు. ఎక్కడికీ వెళ్ళను. ఎక్కడున్నా నీకోసం వచ్చేస్తాగా " అని అన్నాడు.**

మోన్ పా , షముఖా చాపో ఇద్దరూ కలుసుకున్నారు. ఇద్దరూ 7 సంవత్సరాలుగా కలిసి పనిచేస్తున్నారు. ఎప్పుడూ సరదాగా ఉండే షముఖా చాపో ఆ రోజ కాస్త ఆందోళనగా ఉన్నాడు. ఏమిటి అని ఆరా తీస్తే " మనం థామ్ లువాంగ్ గుహల్లోకి వెళ్తున్నాము" అని చెప్పాడు.

ప్రపంచం మొత్తం ఇప్పుడు , ఆ గుహల్లో ఇరుక్కున్న పిల్లల గురించే చర్చ జరుగుతోంది. రెండు రోజుల క్రితమే ఇద్దరు బ్రిటిష్ డైవర్లు గుహల్లోకి వెళ్లి పిల్లలు ఇంకా బ్రతికే ఉన్నారు అన్న విషయాన్ని వెల్లడించిన సంగతి మోన్ పా కి ఇంకా గుర్తుంది.

" ఇప్పుడు అక్కడ జరుగుతున్న ఆపరేషన్ లో పాల్గొనడానికి మనల్ని కూడా పిలిచారేమో" అని వషముఖా చాపో అనుకుంటున్నాడు. వాళ్ళుండే" **ప్రచువాపు ఖిరిఖాన్** " రాష్ట్రం నుండి **పెచావ్ బురి** రాష్ట్రంలోని తాం లువాంగ్ గుహలు 160 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. బస్సులో నాలుగు గంటల ప్రయాణం చేసాక చివరికి తమ గమ్య స్థానం చేరుకున్నారు ఇద్దరూ.

అక్కడ జాతీయ, అంతర్జాతీయ మీడియా వారితో ఆ ప్రాంతం కిటకిటలాడిపోతోంది. ఇన్ని రోజుల తరువాత కూడా అక్కడ ఉన్న పిల్లలు ఇంకా బ్రతికి ఉండటం అందరినీ సంతోషానికి ఆశ్చర్యానికి గురి చేసింది.

అక్కడున్న ఆపరేషన్ నడిపిస్తున్న కమాండర్ Narongsak Osotthanakorn దగ్గరికి వెళ్లి పరిచయం చేసుకున్నారు వారిద్దరూ. మిగతా కొలీగ్స్ , విదేశీ డైవర్లతో మాట్లాడుతూ మోన్ పా ఆ సంఘటన గురించి పలు వివరాలు తెలుసుకున్నాడు.

" అన్ని రోజులు ఎలా ఉన్నారో ?"

" వాడెవడో తెలివైన కోచ్ లా ఉన్నాడు. పిల్లలకు గుహల్లో పారే మంచి నీరు తాగమన్నాడు అంట. అలాగే , పిల్లలని కదలనివ్వకుండా , ఎనర్జీ సేవ్ చేసుకుంటూ, మెడిటేషన్ చెయ్యమన్నాడు అంట."

" మరి తిండి "

" అదృష్టం అంటే అదే ! వారంతా అక్కడ ఒక బృంద సభ్యుడి బర్త్ డే పార్టీ చేసుకుందామని వచ్చారు. దానికి బాగానే తిండి పదార్థాలు తెచ్చుకున్నారు. వాటితో జాగ్రత్తగా తింటూ గడిపారు"

" ఏంటో ఆ గుహల్లోకి ఎందుకు తీసుకెళ్లాడో , ఆ కోచ్ కి మాత్రం బుద్ధి ఉండొద్దు "

" వాళ్ళు గంట సేపే ఉందామని కోచ్ పర్మిషన్ తో లోపలి వెళ్ళారంట. కానీ , అక్కడ ఉన్నట్టుండి వర్షం మొదలయ్యి . వరద నీరు చేరుకుంది. దానితో ప్రమాదం తప్పించుకోవడానికి పెరిగెడుతూ దారితప్పి లోపలి దాకా వెళ్లిపోయారు. "

" ఇప్పుడు ఎంత లోపల దాకా వెళ్లారు"

" దాదాపు మూడు నుండి అయిదు కిలోమీటర్లు లోపల. "

అలా చర్చలు జరుగుతున్నాయి. మీడియా వారిని బయట ఉండమని చెప్పి , మిగతా పనులు అన్నీ అక్కడి టీం చేస్తోంది. దాదాపు 1000 మంది పలు డిపార్ట్మెంట్ వాళ్ళు అక్కడ ఉన్నారు. సన్నటి బోర్లు వేసి లోపలి నుండి నీళ్లు బయటికి లాగుతున్నారు. అలా చెయ్యడం ద్వారా నీటి మట్టం అదుపులో ఉంటుంది అన్న ఆశ.

సరిగ్గా అప్పుడే ప్రకృతి రూపంలో విపత్తు విరుచుకు పడింది. పెద్ద ఎత్తున వర్షం పడటం మొదలయ్యింది. కమాండింగ్ ఆఫీసర్ తల పట్టుకుని కూర్చోవడం చూసాడు మోన్ పా. ఏమైందని స్నేహితుడిని అడగటానికి చోశాడు. అప్పటికే అతనితో వచ్చిన స్నేహితుడు వేరే బృందం తో కలిసి ఏదో పని మీద ఉన్నాడు.

అనుకోకుండా మొదలైన వర్షం బట్టి పరిస్థితి అంచనా వేస్తున్నాడు. వర్షాకాలం అని తెలిసినా , ఉన్నట్టుండి అలా మొదలవుతుంది అని గుర్తుపట్టలేకపోయారు. ఇన్ని రోజులు వాటర్ ని బయటకు లాగడానికి చేస్తున్న ప్రయత్నాలు అన్నీ వృధా అయ్యే పరిస్థితి ఈ వాన తీసుకొచ్చింది. బోరింగ్ పనులు కూడా ఆగిపోయాయి. అప్పుడే పిలుపు వచ్చింది అక్కడున్న కమాండింగ్ ఆఫీసర్ నుండి.

డైవర్లు అందరూ సిద్ధంగా ఉండండి అని. ముఖ్యమైన డైవర్లను పిలిచి చెప్తున్నాడు ఆఫీసర్. ముందుగా విదేశీ డైవర్లను, మిగతా టెక్నిషియన్స్ ని పిలిచి అడిగాడు.

" మనకు ఎంత సమయం ఉంది"

" మరో మూడు రోజుల దాకా వాన పడుతుందని వెథర్ ప్రెడిక్షన్ చెబుతోంది. పరిస్థితి ఇలా కొనసాగితే వారున్న ప్రాంతం కూడా మునిగిపోతుంది. "

" మనకు వారం కూడా సమయం ఉండదా ?"

" ఉండదు. వాన వల్ల వరద నీరు లోపలికి వెళ్తోంది. నాకు తెలిసి 2-3 రోజుల్లో వాళ్ళను బయటకు తీసుకురాకపోతే , ఇక్కడ మనం వెళ్లే ద్వారం వద్ద కూడా నీరు చేరుకుంటుంది. ఆ బురద నీటిలో డైవింగ్ చెయ్యడం అసాధ్యం అవుతుంది " అన్నారు.

కమాండింగ్ ఆఫీసర్ సీరియస్ గా ఆలోచించాడు. డైవర్లను పంపించడం రిస్కీ ఆపరేషన్. కనీసం 7-8 గంటల ప్రయాణం అది. అప్పటిదాకా వారి దగ్గరున్న ఆక్సిజన్ సరిపోకే పోతే వాళ్ళు కూడా చనిపోతారు. ఒక రోజు క్రితమే ఒక డైవర్ (సమన్ గనా) ఊపిరాడక చనిపోయాడు . లోపల నీళ్లు ఒక్కోసారి మనం వెళ్లే దిశకు వ్యతిరేకంగా వస్తే , పని ఇంకా కష్టతరం అవుతుంది. ఇలా వస్తున్న ఆలోచనలతో కమాండింగ్ ఆఫీసర్ బుర్ర వేడెక్కిపోతోంది. మిగతా experts ని కూడా అడిగి ఒక నిర్ణయానికి వచ్చాడు.

మామూలుగా అయితే మూడు రకాల పద్ధతులను ఈ సమస్యకి సమాధానంగా అనుకున్నారు.

*1*.వర్షాకాలం తగ్గి అక్కడ నీటి మట్టం తగ్గే దాకా పిల్లలకు సాయం చేస్తూ ఉండటం. తరువాత తీసుకు రావడం.*(*ఇంకా మూడు నెలలు ఆగాలి*)*
*2*. పిల్లలు ఉన్న చోటకు దగ్గరలో డ్రిల్లింగ్ చేసి , వారిని బయటకు తీయడం. *(*నెల రోజులు *)*
3. డైవర్లను పంపి పిల్లలకు కాస్త డైవింగ్ నేర్పించి. వాళ్ళతో పాటు తీసుకు వచ్చెయ్యడం. *(*వెంటనే *)*

" మన చివరి ఆప్షన్ కే వెళదాం. " అని డైవర్లను పంపడానికి నిశ్చయించుకున్నాడు.

********

డైవర్లు లోపైలికి వెళ్ళడానికి సిద్ధం అయ్యారు. ఇంతముందు వెళ్లిన బ్రిటిష్ డైవర్లు, ఒక మంచి పని చేశారు. దారిపొడవునా తాడులు గుహ గోడలకు తగిలిస్తూ వెళ్లడం వల్ల వెళ్లాల్సిన ప్రాంతానికి దారికి తెలుసుకోవడం సులువే. కానీ అక్కడ అస్సలు సమస్య వేరు.

ఆపరేషన్ ప్లాన్ ఏమనగా వాళ్ళతో పాటు ఇంకొక ఆక్సిజన్ సిలిండర్ , డైవింగ్ సూట్స్ పిల్లలకోసం తీసుకువెళ్ళాలి. అక్కడికి వెళ్ళాక ఒక్కొక్క పిల్లవాడికి డైవింగ్ లో చిన్న క్లాసు చెప్పి దాని ప్రకారం వాళ్ళని తమతో ఒక్కొక్కరినీ ఒక్కొక్కళ్ళు తీసుకెళ్ళాలి. థాయిలాండ్ భాష వచ్చిన కారణం చేత మోన్ పా ని , కొంత మంది లోకల్ డైవర్లను కూడా తీసుకెళ్తున్నారు. అయితే అతని స్నేహితుడు మాత్రం బయటే ఉండిపోవాల్సి వచ్చింది. మొత్తం అందరూ గుహ లోపలి వెళ్ళేదాకా మీడియా వారు కవర్ చేశారు. ఇక లోపలి ఎంటర్ అవుతున్నాం అనగా వారిని పంపించి తమ పనిలో తాము మునిగారు.

గుహల్లో నీరు అప్పటికే మెడ దాకా చేరుకుంది. మరికొన్ని చోట్లలో, ఆ నీరు పూర్తిగా నిండిపోయి ఉంది ఉంది. జాగ్రత్తగా వెళ్లాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఆపరేషన్ అయ్యే 6 గంటల సేపు పాటు వారి దగ్గరున్న ఆక్సిజన్ సిలిండర్లు ఉపయోగపడాలి. ఎక్కడ మెడదాకా నీళ్లు కనిపించినా వెంటనే పైకి వచ్చి ,ఆక్సిజన్ మాస్క్ తీసేసి , అక్కడున్న మామూలు గాలిని పీల్చాలి. పిల్లలున్న ప్రాంతంలో మరో ప్రమాదం పొంచి ఉంది.

ఆక్సిజన్ ప్రమాణం ఆ ప్రాంతం లో రోజ రోజుకీ కీ తగ్గిపోతూ వస్తోంది. 15 శాతం కన్నా తగ్గిన కొద్దీ వారికి బ్రతికే అవకాశాలు తగ్గిపోతాయి. అందుకే ఇలా హడావిడిగా డైవర్లను రంగంలోకి దించారు.

ఎక్కడ అవకాశం దొరికినా శక్తిని పొదుపు చేసుకుంటూ , బయటి గాలిని పీల్చుకుంటూ మళ్ళీ ప్రయాణం చేస్తున్నారు. నీటి ప్రవాహం వారి పయనం ఉన్న దిశలో ఉంది కాబట్టి వెళ్లడం వరకు సులువుగానే కనిపించింది. పిల్లలకు అప్పటిదాకా సరిపడా లిక్విడ్ ఆహార పదార్థాలను వెంటబెట్టుకుని తీసుకెళ్తున్నారు.

వారున్న ప్రాంతానికి వెళ్లాలంటే కూడా ఒక రిస్క్ ఉంది. మొదటి ఆ గుహ ఎంట్రన్స్ నుండి ఒక దిశగా వెళ్లి ఆగాలి. ఆ తరువాత అక్కడి నుండి ఎడమవైపు 3 కిలోమీటర్లు దాకా ప్రయాణం చేయాలి. కొన్ని కొన్ని చోట్ల మనుషులు దూరడానికి కష్టమైన సన్నని మార్గాలు కూడా వస్తున్నాయి ఆ పయనంలో. ఎన్నో గంటలపాటు వాటిని దాటుకుంటూ , ఆ చీకటిలో , బురద నీటిలో , ఒళ్ళు కొరికే చలి మధ్యలో డైవర్లు పట్టువదలకుండా తాడుని బేస్ చేసుకుని ప్రయాణం సాగించారు.

ఆరు గంటల 25 నిమిషాల ప్రయాణం తరువాత అక్కడికి చేరుకున్నారు డైవింగ్ సభ్యులు. వాళ్ళని చూసి పిల్లలకు ప్రాణం లేచొచ్చినట్టయింది. కానీ , ఆనందాన్ని వ్యక్తం చెయ్యడానికి ఓపిక వారికి లేదు. ముందుగా, వెళ్ళడానికి సిద్ధంగా ఉన్న 9 మంది పిల్లలని ఎంచుకుని వారికి డైవింగ్ లో కొన్ని సూచనలు చెప్పి తీసుకువెళ్లారు కొంత మంది డైవర్లు. వెనక్కి వచ్చేటప్పుడు నీరు పెద్దగా ఎదురుగా ఇబ్బంది కలిగించలేదు కాబట్టి వారిని కాపాడటం కష్టం కాలేదు. మోన్ పా కి మళ్ళీ ప్రాణం లేచొచ్చినట్టయింది. అందరికీ సూట్ లు కట్టి , వారి ఒంటికి ఆక్సిజన్ సిలిండర్లు సమకూర్చి తీసుకుని వచ్చారు. మిగతా వాళ్ళకి సరిపడా సదుపాయాలు , వస్తువులు ఇచ్చి మళ్ళీ వచ్చేస్తాం ఉండండి అన్నారు.

మిగిలిన వారిని ఎప్పుడు తీసుకువస్తారో ఆలోచిస్తున్నాడు అతను. గుహ నుండి బయటకి రాగానే ప్రపంచం మొత్తం పూల వర్షం కురిపిస్తోందా , దేవలోకం నుండి వాద్యాలు విన్పిస్తున్నాయా అన్నట్టు ఆ ప్రాంతం మొత్తం ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. పిల్లలని వెంటనే అంబులెన్స్ లో ఎక్కించి తీసుకువెళ్తున్నారు.

కానీ, రావాల్సిన మిగతా నలుగురి గురించి ఆందోళన గా ఉంది మోన్ పా కి . ఇవాల్టి విశ్రాంతి తీసుకోండి అన్న ఆదేశాలు వచ్చాయి. అందరూ తమ తమకు కేటాయించిన విడుదుల్లో విశ్రాంతి పొందుతున్నారు. **జులై 10 వ తారీఖున అక్కడ ఉన్న గుహ మొత్తం పూర్తిగా నీటితో నిండిపోతుంది.** ఏమి చేసినా ఆ లోపలే చెయ్యాలి. ఇంకొక్క రోజు మాత్రమే సమయం ఉంది. ఆ ఆలోచనలతోనే కాస్త కునుకు తీసాడు మోన్ పా.

నిద్రలో కూడా అతనికి పీడ కలలు వస్తున్నాయి. తన భార్య వెక్కి వెక్కి ఏడుస్తుంటే చుట్టూ అందరూ ఓదారుస్తున్నట్టు వినపడుతోంది. ఎంత ఓదార్చినా ఆమెని ఓదార్చడం ఎవరి తరమూ కావడం లేదు. దెబ్బకి నిద్ర నుండి ఉలిక్కి పది లేచాడు మోన్ పా. అతని మనస్సు ఏదో కీడు శంకిస్తోంది. అదేంటో అతనికి కూడా అర్థం కావడం లేదు.

పొద్దున్న తిరిగి రెస్క్యూ ఆపరేషన్ లు మొదలు పెట్టారు. ఇక సమయం అట్టే లేదని అర్థం అయిపోయింది అందరికీ. లోపల ఉన్న వారికి కూడా నీరు కాళ్ళ దాకా వచ్చేసినట్టు తెలుస్తోంది. అంటే అక్కడికి కూడా వరద నీరు చేరిపోయింది అన్నమాట.

తిరిగి వందలాది మంది రెస్క్యూ టీం పనిలో పడ్డారు. వర్షం మళ్ళీ మొదలై భయంకర రూపం దాల్చుకుంది. మోన్ పా మిగతా టీం తో కలిసి వెళ్తున్నాడు. లోపలి దాకా చేరుకొని రెండవ దశలో వెళ్లాల్సిన ఎడమ పక్కన దారివైపు పయనిస్తున్నాడు. సన్నని ఆ దారిని దాటడం కాస్త కష్టం అయ్యింది అతనికి మాత్రం. రెండు నెలలుగా సరిగ్గా పనిలేక టైం కి తిండి తినక వచ్చిన ఊబకాయం ఇప్పుడు అతనిని ఇబ్బంది పెడుతోంది. బరువు పెరిగితే అలసట , ఊపిరి పీల్చడం కూడా ఎక్కువ అవుతుంది కదా. అందువల్ల ఎక్కువ ఆక్సిజన్ ని ఖర్చు పెట్టాల్సి వస్తోంది. నిన్నటి రోజున ఉన్న దారులు కూడా , ఇప్పుడు పూర్తిగా నీళ్లలో మునిగిపోయి ఉన్నాయి. మాస్క్ తీసి పైకి వచ్చి ఊపిరి పీల్చుకునే అవకాశం లేదు. కాకపొతే మిగతా డైవర్లు అంతార్జాతీయ స్థాయి నిపుణులు అవ్వడం వలన వాళ్ళు సులువు గానే వెళ్తున్నారు లోపలికి. అక్కడ ఉన్న పిల్లలు మునిగిపోకూడదని దేవుళ్ళందరినీ మొక్కుకున్నాడు అతను. చివరికి మొత్తం మీద ఆ పిల్లలు ఉన్న ప్రాంతం వైపుకి వచ్చేసారు వారు.

మాస్క్ తీసి మిగిలిన గాలితో ఆక్సిజన్ పీల్చుకున్నాడు అతను. పిల్లలని కోచ్ ని తీసుకుని నెమ్మదిగా బయలుదేరారు అక్కడున్న వారందరూ. ఎవరెవరు ఎవరిని తీసుకువెళ్ళాలి అని నిర్ణయం జరిగిపోయింది. మోన్ పా ఒక పిల్లవాడిని తీసుకెళ్లే బాధ్యతని తీసుకున్నాడు. తిరుగు ప్రయాణం లో నీరు ఎదురు దిశలో రావడం వలన బయటికి రావడం మరింత కష్టం అవుతోంది. వర్షం వలన, అప్పటిదాకా ఏమాత్రం నీరు లేని ప్రాంతాల్లో కూడా నీరు రావడం మొదలయ్యింది. ఆ నీరు ఒక్క సారిగా మోన్ పా అతనితో పాటు ఉన్న పిల్లవాడిని వెనక్కి నెట్టేసింది.

"నేను సాయం చెయ్యనా " అని అడిగారు పక్కనున్న డైవర్లు.

" పర్లేదు ! నేను మానేజ్ చేస్తాను" అని భరోసాగా చెప్పాడు.

ఆ మాట విని వారు ముందుకు వెళ్లి ఇరుకైన సందులో నుండి దూరి ముందుకు వెళ్లారు.

మోన్ పా వారిని చూసాడు. నీటి వేగం పెరిగి , ఆ పిల్లవాడిని అతనిని దాదాపు 400 మీటర్లు వెనక్కి నెట్టేసింది. ఒకపక్కన తాడు. మరొక పక్కన పట్టుకున్న పిల్లవాడు రెండిటిలో ఏది వదిలిపెట్టలేడు. వెనక్కి కొట్టుకెళ్తున్న అతన్ని దేవతలా కాపాడింది ఒక రాయి. ఆ రాయికి కాలు ఆనించి, వెనక్కి కొట్టుకుపోకుండా ఆగాడు. మళ్ళీ నెమ్మదిగా ప్రయాణం మొదలుపెట్టాడు మోన్ పా.

ఇందాక అందరూ వెళ్లిన దారిలో బయటకు వచ్చే పనిలో ఉన్నాడు మోన్ పా. అతనికి సడన్ గా ఏదో తేడా అనిపించింది. చూస్తే ఆక్సిజన్ తగ్గుతున్నప్పుడు వచ్చే వాసన లాంటిది తన నాసికానికి తగిలింది. ప్రమాదం ఏంటో ఇప్పుడు అర్ధం అయ్యింది. వీలైనంత త్వరగా అక్కడ నుండి బయటికి వెళ్ళాలి. ఆక్సిజన్ అయిపోయేలోపల ముందుకు బయటపడాలి. మధ్యలో పిల్లవాడికి ధైర్యం చెబుతున్నాడు. అతని నాడిని, ఆక్సిజన్ ట్యాంక్ ని తడిమి చూస్తున్నాడు.

రాత్రి నుండి తనకు వస్తున్న పీడ కల ఇదేనేమో. ఇంత పెద్ద ఆపరేషన్ లో తానొక్కడే పిల్లవాడి ప్రాణం కాపాడలేని చేతకాని వాడుగా మిగిలిపోతాడేమో అన్న భయం పట్టుకుంది. ఒక పక్కన శక్తిని కూడ తీసుకుని ముందుకు వెళ్ళాలి. మరొక పక్కన పిల్లవాడిని కాపాడాలి. నీటికి ఎదురీదుతూ వెళ్ళాలి. కానీ , ఆక్సిజన్ చాలదు. ఏమి చేద్దాం అని ఒక్క క్షణం ఆలోచించాడు.

తన భార్య గుర్తొచ్చింది. మొన్న రాత్రి తన ఉద్యోగం గురించి అంతలా ఎందుకు గొడవపడిందో అర్ధం అయినట్టు అనిపించింది తనకు. తన భార్య మాట విననందుకు బాధపడ్డాడు. తిరిగి అసలు చెయ్యాల్సిన పని మీద దృష్టి పెట్టాడు .

సిలిండర్ లో ఆక్సిజన్ చివరి దాకా వచ్చేసినట్టు సూచనలు తెలుస్తున్నాయి. మొదటి దశ దాటేసి , ఎడమ కాలువ నుండి ముందు భాగానికి (ముఖ ద్వారం) వైపు వెళ్తున్నాడు. వెళ్లాల్సిన దూరం చాలా ఉంది. ఏమి చేద్దాం అని ఒక క్షణం ఆగి ఆలోచించాడు. ఒక్కటే దారి.

ఆ కాస్త దూరం , వెళ్ళాలి అంటే , ఆక్సిజన్ తక్కువ వాడాలి. అంటే , తాను ఊపిరి మూడు సార్లకు ఒక్క సారి మాత్రమే తీసుకోవాలి. అలా ఫిక్స్ అయ్యి బయలుదేరాడు. మూడు అంగలు వెయ్యడం - ఆ తరువాత ఊపిరి ఒక్క సారి పీల్చుకోవడం చేస్తూ ముందుకు సాగుతున్నాడు మోన్ పా. ఇంకా ఎంత దూరం ఉందో లోపలి నుండి తెలియడం లేదు. తాను భయపడిన క్షణం వచ్చేసింది. ఆక్సిజన్ పూర్తిగా అడుగుకి చేరుకుందని అర్థం అయ్యింది.ఆ క్షణం అతని కళ్ళ ముందు జీవితం మొత్తం కనిపిస్తోంది.

సరిగ్గా , అదే సమయానికి వరద నీరు గుహ ముందు భాగానికి చేరుకుంది. మిగతా డైవర్లు బయటికి వచ్చేసారు పిల్లలు , కోచ్ తో. మిగిలింది అతనొక్కడే. వరద నీరు చేరడం వలన మిగతా స్టాఫ్ కూడా అక్కడి నుండి గుహ ద్వారం నుండి బయటకు వచ్చేసారు. ప్రపంచం మొత్తం ఊపిరి బిగపట్టుకుని చూస్తోంది. మోన్ పా చివరి స్వాస తీసుకునే సమయానికి చేరువ అవుతున్నాడని వారికి తెలియదు.

అప్పుడే తన భార్య ఏడుస్తున్నట్టు వచ్చిన కల గుర్తొచ్చి దృఖం పొంగుకొచ్చింది. ఏమి చెయ్యాలో పాలుపోవడం లేదు. ఎదురు నీటి ప్రవాహం వేగంగా ఉంది. మోన్ పా ఉన్న స్థలాన్ని గుర్తుపట్టలేకపోతున్నారు బయట నుండి. సెన్సార్లు కూడా సరిగ్గా పనిచేయకపోవడం ఒక కారణం. పిల్లవాడికి ఒక రకమైన sedatives ఇందాకే ఇవ్వడం వలన, పెద్దగా స్పృహలో లేడు.ఏమవుతుందో తెలియడం లేదు.

" నిజంగా. నెత్తి మీదకు తెచ్చుకోవుగా "

" లేదు. ఎక్కడికీ వెళ్ళను. ఎక్కడున్నా నీకోసం వచ్చేస్తాగా "

ఇవే మాటలు గుర్తొచ్చాయి. మనస్సులో ఒక్కటే అనుకున్నాడు. ఊపిరి పీల్చకుండా అతను 3-4 నిమిషాల దాకా ఉండగలడు. ఆ కాసేపట్లో గుహ ద్వారం వస్తే అతను బ్రతుకుతాడు. లేదా కష్టం అనుకుని. ఉన్న గాలి మొత్తం పీల్చుకుని ముందుకు డైవ్ చేసాడు. తాడుని వదిలేసాడు. పిల్లవాడిని గట్టిగా ఒక చేత్తో పట్టుకున్నాడు. వేగంగా ముందుకు సాగుతూ వెళ్తున్నాడు. ఇన్ని సంవత్సరాలు తన డైవింగ్ విద్యలో నేర్చుకున్న మెళుకువలు అన్నీ ప్రయోగిస్తూ ముందుకు సాగుతున్నాడు. అలా రెండు నిమిషాలు గడిచాయి. ఎదురుగా ఒక సన్నటి గోడ తగిలి ఆగాడు. మొండిగా ఆ సన్నటి మార్గం గుండానే ముందు పిల్లవాడిని నెట్టి , తాను ముందుకు వచ్చాడు.

ముందుకు వచ్చాడు. మరొక నిమిషం గడిచిపోయింది. ఇంకాసేపు మాత్రమే అతను గాలిని ఆపగలడు. అది దాటితే, అతని చేతుల్లో ఏమి లేదు. ఆక్సిజన్ అందకపోవడంతో మోన్ పా మెదడు కూడా పని చెయ్యడం లేదు. అరనిమిషం లో ఇంకా వేగంగా ముందుకి ప్రయాణం చేసి తాడు పట్టుకున్నాడు. మరింత ముందుకు వచ్చాడు. కళ్ళు మండుతున్నాయి. ఊపిరి తీసుకోకపోవడంతో శరీరం మొత్తం మొద్దు బారిపోయింది. నెమ్మదిగా కళ్ళు మూతపడటం మొదలయ్యింది. స్పృహ కోల్పోయాడు. ఎదురుగా చీకటే కనిపిస్తోంది. బయట ద్వారం తాలూకు సూచనలు ఏదీ కనిపియ్యడం లేదు. శరీరం విలవిలా కొట్టుకోవడం మొదలయ్యింది. ఇక ప్రయాణం చేయలేకపోతున్నాడు అతను.

సరిగ్గా అదే సమయంలో అతనిపై రెండు చేతులు పడ్డాయి. స్పృహ కోల్పోతున్న మోన్ పా ని , అతని ఒళ్ళో పిల్లవాడిని తీసుకుని బయటికి వచ్చేసారు. 40 సెకండ్లలో గుహ నుండి బయట పడ్డారు. నీటి నోట్లోకి వెళ్ళిపోయిన మోన్ పా ఊపిరి తీసుకోవడం కోసం ఎదురు చూస్తున్నాడు. కళ్ళు ఎర్రగా అయిపోయినాయి. ప్రాణం పోతున్నట్టుగా అనిపిస్తోంది. మోన్ పా ముఖం మీద ఎవరో ఆక్సిజన్ మాస్క్ కప్పడం మాత్రమే గుర్తుంది. బయట నుండి జనాలు ఏదో అరుస్తున్న సౌండ్ మాత్రమే గుయ్ మని వినిపిస్తోంది.

కాసేపటికి లేచి చూసాడు మోన్ పా. అంబులెన్స్ లో నర్స్ , డాక్టర్ కొడుతున్నారు చెంప మీద. "

ఏమైందో తెలియనట్టు " చూసాడు మోన్ పా .

డాక్టర్ , " he survives " అని ప్రకటించాడు.

పక్కనే , షాక్ ఇవ్వడానికి ఇచ్చే మెషిన్ లు కనిపించాయి. చచ్చి బతికాను అని అర్థం చేసుకున్నాడు మోన్ పా.

**" నిజంగా. నెత్తి మీదకు తెచ్చుకోవుగా "**

**" లేదు. ఎక్కడికీ వెళ్ళను. ఎక్కడున్నా నీకోసం వచ్చేస్తాగా "**

మళ్ళీ గుర్తొచ్చింది తన భార్య మాటలు. మనసులో మెలి మెల్లిగా నవ్వుకున్నాడు.

" ఎక్కడికెళ్లినా వచ్చేస్తాగా , తనకోసం " అనుకున్నాడు.

ప్రశాంతం గా లేచి కూర్చున్నాడు.